సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం | 10 | అక్టోబర్ | 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 పలికాయి. మార్కెట్‌కు 24 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



రచిన్ రవీంద్ర..'ఆర్డీటీ'లో ముద్ర!

వరల్డ్‌కప్‌లో దుమ్ములేపుతున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్రకు ఆర్డీటీతో అనుబంధం ఉంది. షాబుద్దీన్, జోషి, యుగంధర్‌రెడ్డి వద్ద రచిన్ శిక్షణ తీసుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.1°/22.3°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

13న కదిరిలో మెగా జాబ్ మేళా



జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, 'సీడాప్' సంయుక్తంగా ఈనెల 13న కదిరిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ...కదిరి ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని సుమారు 600 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్బారావు, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఒక్కోరోజు ఒక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ మేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. 15వ తేదీ మత్స్యావతార అలంకారం, 16న కూర్మావతార అలంకారం, 17న నృసింహ అవతార అలంకరణ, 18న రామావతార అలంకరణ, 19న కృష్ణావతార అలంకరణ, 20న సరస్వతీ అలంకరణ, 21న మోహినీ అలంకరణ, 22న వేంకటేశ్వర అలంకారాల్లో స్వామివారు దర్శనమిస్తారన్నారు. 23వ తేదీ విజయదశమి రోజున అశ్వవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని వెల్లడించారు.

హిందూపురంలో టీడీపీ నాయకుల ఓవరాక్షన్

- పోలీసులపై దురుసు ప్రవర్తన



హిందూపురంలో పోలీసులను తోస్తున్న టీడీపీ కార్యకర్తలు

హిందూపురం: టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. హిందూపురంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గురునాథ్ సర్కిల్ వద్ద ఇరువైపులా కార్యకర్తలు గుమిగూడారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని, అలాగే 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ర్యాలీలు చేయరాదని పోలీసులు చెబుతున్నా ..వారు ఏమాత్రమూ వినిపించుకోలేదు. ఎంతసేపు నచ్చజెప్పినా వినకపోవడంతో టీడీపీ నేత అంబికా లక్ష్మినారాయణతో పాటు మరికొందరిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో స్టేషన్ వద్దకు చేరుకున్న టీడీపీ కార్యకర్తలు.. పోలీసులను పక్కకు తోసి మరీ లోపలికి దూసుకుపోసాగారు. సీఐనే వచ్చి తమ పార్టీ నాయకులను బేషరతుగా వదిలేయాలంటూ స్టేషన్ వద్ద బైఠాయించారు. సీఐ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండడంతో పోలీసులు అదే విషయాన్ని చెప్పి వారిని అక్కడి నుంచి పంపించివేశారు. 30 యాక్ట్ ధిక్కరించిన వారిపై 341, 188 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీస్తోన్న వేగం

- విషాదం నింపుతున్న రోడ్డు ప్రమాదాలు
- మృతుల్లో ద్విచక్ర వాహనదారులే అధికం
- యువకుల మరణాలతో తల్లిదండ్రులకు గుండెకోత
- 90 శాతం రోడ్డు ప్రమాదాలు మితిమీరిన వేగంతోనే

❐ రెండు వారాల క్రితం గుత్తికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బైక్‌పై మితిమీరిన వేగంతో అనంతపురం వస్తుండగా గార్లదిన్నె దగ్గర ప్రమాదానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది.

❐ నాలుగు రోజుల క్రితం పెనుకొండ దగ్గర ఉన్న కియా పరిశ్రమ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు మన్నీల గ్రామం దగ్గరకు రాగానే వేగంగా ఐచర్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే చనిపోవడంతో తల్లిదండ్రులు దిక్కులేని వారయ్యారు.



రోడ్డు ప్రమాద దృశ్యం



ప్రమాదాల నియంత్రణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మితిమీరిన వేగం యువత ప్రాణం తీస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలుస్తారనుకున్న యువకులు వేగం మోజులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. యువకులపై తల్లిదండ్రులు గంపెడాశలు పెట్టుకుంటారు. వారు జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలు, ఆశయాలపై కోటి ఆశలతో ఎదురు చూస్తుంటారు. ఏ కష్టమొచ్చినా ఎదురొడ్డి పోరాడేందుకు నా కొడుకు ఉన్నాడని గొప్పగా చెప్పుకుంటుంటారు. అలాంటి సమయాన రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళిస్తే తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. జిల్లాలో ద్విచక్రవాహనదారులు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రాణాలు కోల్పోతున్న తీరు విషాదం కలిగిస్తోంది.

ప్యాషన్‌గా మారి ప్రాణం మీదకు..

ఇరవై ఏళ్లు కూడా నిండకుండానే గారాబంతో కొడుక్కు 220 సీసీ బైక్‌ను తల్లిదండ్రులు తీసిస్తారు. బైక్ ఇచ్చారు కదా అని నెమ్మదిగా వెళతాడా అంటే అదీ లేదు. మితిమీరిన వేగంతో వెళ్లడం.. ఎక్కడో ఒక చోట ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం షరా మామూలైపోయింది. అయినా యువకుల తీరులో మార్పు రావడం లేదు. ఇంట్లో ఎంత నచ్చజెప్పి పంపినా రోడ్డుమీదకొచ్చే సరికి ప్యాషన్ (మోజు)తో అతివేగంగా డ్రైవ్ చేస్తున్నారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం ద్విచక్రవాహనదారులవే. ఇందులో మృతి చెందుతున్నది 90 శాతం మంది 30 ఏళ్ల లోపు యువకులే. ఏడాదికి సగటున 360 మంది యువకులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువకుల్లో మార్పు రావడం లేదు. యువకులు బైక్ ఎక్కితే చాలు కంటికి కనిపించనంత వేగంతో దూసుకెళ్తున్నారు. ప్రమాదానికి గురై మృతి చెందిన వారిలో 70 శాతం మంది హెల్మెట్ లేకుండా వెళ్లిన వారే.

2023 సంవత్సరంలో జరిగిన ప్రమాదాలు

నెల	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఏప్రిల్	61	39	57
మే	55	35	94
జూన్	51	38	41
జూలై	41	30	32
ఆగస్టు	30	19	38
సెప్టెంబర్	39	32	45

వేగమే కొంప ముంచుతోంది

యువకులు ఏదో ఒక గుర్తింపు (ఐడెంటిటీ) వస్తుందన్న ఆలోచనతో మితిమీరిన వేగంతో బైక్‌లు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అక్కడికీ హెల్మెట్‌లేని వారికి జరిమానాలు విధిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం.

– వీర్రాజు, ఉపరవాణా కమిషనర్

బాలలకు బైకులు ఇవ్వొద్దు

పాతికేళ్ల కుర్రాళ్లు అనగానే కుటుంబానికి అండగా నిలవాల్సిన వారు. జీవితంలో ఎన్నో సాధించాల్సిన వయసులో ఇలా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవడం బాధాకరం. పద్దెనిమిదేళ్ల లోపు వాళ్లకు తల్లిదండ్రులు బైకులు ఇవ్వరాదని సూచిస్తున్నాం. చాలా ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రమాదాల నియంత్రణకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రవాణాశాఖ పరిధిలో తరగతులు నిర్వహిస్తున్నాం.

– ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ, అనంతపురం

డిటోనేటర్‌తో దాడి ఘటనపై ఎస్పీ విచారణ

గోరంట్ల: ఎలక్ట్రిక్ డిటోనేటర్‌తో పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ వాహనంపై దాడి ఘటనపై సోమవారం ఎస్పీ మాధవరెడ్డి విచారణ చేపట్టారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి గ్రామానికి చెందిన హరిజన గణేష్ ఆదివారం మండల పరిధిలోని కల్లితండా వద్ద ఎలక్ట్రికల్ డిటోనేటర్‌తో ఎమ్మెల్యే శంకరనారాయణ కారుపై దాడి చేసిన విషయం తెల్సిందే. సంఘటన జరిగిన గంటకే ఎస్పీ మాధవరెడ్డి గోరంట్ల పోలీసుస్టేషన్‌కు చేరుకొని ఘటన తీరుతెన్నులను సీఐ సుబ్బరాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముద్దాయి గణేష్‌ను విచారించేందుకు ప్రయత్నించగా, అతను మద్యం మత్తులో ఉండటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. సోమవారం సాయంత్రం మరోసారి ఎస్పీ మాధవరెడ్డి గోరంట్ల పోలీసు స్టేషన్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. గణేష్‌తో మాట్లాడటంతో పాటు ఘటనపై వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.

నేడు పెన్షన్ అదాలత్

అనంతపురం సిటీ: కడప రీజనల్ పరిధిలోని అన్ని జిల్లాలకు సంబంధించిన ఈపీఎస్–1995 పెన్షనర్లు, సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. అక్టోబర్ నెలకు సంబంధించి పెన్షన్ అదాలత్‌ను ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా నిర్వహిస్తున్నామన్నారు. పెన్షనర్లతో పాటు మూడు నెలల్లో పెన్షనర్లు కాబోయే వారు కూడా తమ ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల సభ్యులు అదాలత్‌లో పాల్గొనవచ్చన్నారు. https://meetingsapac19.webex.com/meetingsapac19/i.php?MTIC=m3c3d8618e6f95d56a7e9f0061d65b5b6 లింక్ ద్వారా పాల్గొనవచ్చు.

మీటింగ్ నెంబర్: 2640 733 7172
పాస్‌వర్డ్: 12345

జెడ్పీలో ఆన్‌లైన్ సేవలు

- వెబ్‌సైట్ రూపొందిస్తున్న అధికారులు
- రాష్ట్రంలో సొంత వెబ్‌సైట్ కలిగిన రెండో జిల్లాగా అనంత
- ఇకపై జెడ్పీటీసీ సభ్యులందరికీ ప్రత్యేక లాగిన్ ఐడీలు
- పనుల ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో పంపేలా ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ విభాగాల్లో అతిపెద్దదిగా జిల్లా పరిషత్‌కు పేరుంది. స్కూళ్లు, గ్రామీణ నీటిసరఫరా, ఎంపీడీఓల వ్యవస్థ.. ఇలా ఒకటేమిటి వేలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులు కలిగిన ఈ విభాగం త్వరలోనే కొత్త తరహాలో పాలనా వ్యవహారాలు చేపట్టనుంది. జిల్లాస్థాయిలో ఒక విభాగం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించి పనులు చేపట్టడం కష్టమే. అలాంటిది అనంతపురం జిల్లాలో జెడ్పీ విభాగాన్ని ఆన్‌లైన్ పరిధిలోకి తెస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే ఈ వ్యవస్థ అమల్లోకి తీసుకొస్తారు.

కొత్త వెబ్‌సైట్ ఇలా..

ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఒకటే జెడ్పీ ఉంది. కో ఆప్షన్ మెంబర్‌తో సహా 63 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీళ్లందరూ ఎలాంటి పనుల కోసమైనా జెడ్పీకి వస్తున్నారు. ఇక్పై ఇలాంటి పరిస్థితి లేకుండా zpananthapuram.ap.gov.in పేరుతో కొత్త వెబ్‌సైట్ తీసుకొస్తున్నారు. ప్రతి జెడ్పీటీసీ మెంబర్‌కు ఒక్కో లాగిన్ ఐడీ ఇస్తారు. ఇకపై ఆ లాగిన్ ద్వారా తమ మండల పరిధిలో జరిగే పనుల ప్రగతి లేదా ప్రతిపాదనలు పంపుకోవచ్చు. ఇప్పటి వరకూ ప్రత్యేక వెబ్‌సైట్ కలిగి ఉన్న జెడ్పీ ఒక్క గుంటూరు మాత్రమే రెండోజిల్లాగా అనంతపురాన్ని చెప్పుకోవచ్చు.

ఐవీఆర్‌ఎస్ విధానం అమలు

ఐవీఆర్‌ఎస్ అంటే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం అంటారు. ఈ విధానం ద్వారా జెడ్పీలో జరుగుతున్న పలు వర్కులపై ప్రజాభిప్రాయం తెలుసుకుంటారు. అంతేకాదు జెడ్పీటీసీల నుంచి ఐవీఆర్‌ఎస్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకుని అమలు చేయాలనేది ముఖ్య ఉద్దేశం. ఐవీఆర్‌ఎస్ ద్వారా తాగునీరు మొదలుకొని, రోడ్డు పనుల వరకూ ఆయా ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే వీలుంటుంది.

పనులపై ప్రతి బుధవారం సమీక్ష

జెడ్పీ అంటే ఉద్యోగులే కాదు.. పనులు అత్యంత కీలకం. ఇకపై ప్రతి బుధవారం పనులపై సమీక్ష నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. సమీక్ష నిర్వహించిన రోజు ప్రోగ్రెస్ ఏమేరకు ఉంది, తర్వాత జరిగే నాటికి అభివృద్ధి ఏమిటి అనేది బేరీజు వేస్తారు. దీన్నిబట్టే ఇకపై కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ నుంచి సీఈఓ వరకు ఫైళ్ల పరిష్కారం కూడా ఆన్‌లైన్‌లో జరిగేలా చూస్తారు.

పారదర్శకత కోసమే..



ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించడం ద్వారా పనుల పరిష్కారం వేగంగా ఉంటుంది. దూరంగా ఉన్న జెడ్పీటీసీ సభ్యులు అనంతపురం రావాల్సిన పనిలేదు. తమకు ఇచ్చిన లాగిన్ ద్వారా మాకు ప్రతిపాదనలు పంపించవచ్చు. ఇప్పటివరకూ ఏపీలో గుంటూరులో మాత్రమే జిల్లాపరిషత్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ ఉంది. త్వరలోనే ఇక్కడ ప్రవేశపెట్టి ఆన్‌లైన్ ద్వారా పనులు చేయబోతున్నాం.

– కేతన్‌గార్గ్, సీఈఓ, జిల్లా పరిషత్

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

- జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్ బాబు



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: నిరుపేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ప్రత్యేక అధికారి, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబు, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి సోమందేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలు, వైద్య పరీక్షల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం తీసుకువచ్చి నిరుపేద రోగులకు ఉచితంగా మందులు, శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారన్నారు. అనంతరం ఆయన స్థానిక సప్తగిరి కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యారంగంపై రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం చాకర్లపల్లి వద్ద ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్‌ను సందర్శించారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఎంపీపీ గంగమ్మ, సర్పంచ్ గంగాదేవి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- హోంగార్డులకు క్రమశిక్షణ ముఖ్యం: కమాండెంట్ మహేష్‌కుమార్



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్‌ఐ రాజశేఖరరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఉత్తమ సేవలతోనే గుర్తింపు సాధ్యమని, దీన్ని గుర్తించి ప్రతి హోంగార్డు పని చేసి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. సోమవారం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండులో హోంగార్డులకు ప్రత్యేక శిక్షణతో పాటు పరేడ్, దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్ కుమార్ మాట్లాడుతూ... హోంగార్డు ఉద్యోగంలో చేరే ముందు ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్న అంశాలు, క్రమశిక్షణను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. ముఖ్యంగా విధుల్లో నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే సబ్ డివిజన్ అధికారులు, ఆర్‌ఐల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు, అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదు

- సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు
- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో అందే అర్జీలన్నీ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, గడువు మీరిన తర్వాత ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా వివిధ సమస్యలపై 376 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరిస్తే మరోసారి అర్జీదారుడు స్పందనకు వచ్చే అవకాశం ఉండదని, దీన్ని గుర్తించి గడువులోపే అర్జీలన్నీ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ అర్జీలపై ఆయాశాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని...

- కొత్తచెరువు మండలం కే.లోచర్ల గ్రామ రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 3851–ఏ లోని 5.56 ఎకరాల భూమి 60 ఏళ్ల నుంచి తమ అనుభవంలో ఉందని, 1992 జనవరిలో పట్టా కూడా పొందామని పుట్టపర్తి మండలం జగరాజుపల్లికి చెందిన బయపరెడ్డి భార్య లక్ష్మమ్మ కలెక్టర్‌కు తెలిపారు. అయితే ఇటీవల సదరు భూమిని లోచర్ల గ్రామానికి చెందిన బయపరెడ్డి కుమారుడు ఓబుళరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకుని వన్–బీ, పట్టాదార్ పాస్ పుస్తకం పొందారన్నారు. వాటిని రద్దు పరిచి తన పేరున మంజూరు చేయాలని లక్ష్మమ్మ కోరారు.
- తమకు పుట్టపర్తి మండలం పెడపల్లిలో సర్వే నంబర్ 172,173,173–3లోని 7 ఎకరాల భూమి ఉండగా, 2021లోనే అగ్రికల్చర్ ల్యాండ్ నుంచి నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేశామని చంద్ర, నాయుడు, కుమార్ తదితర రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఇటీవల ఆ భూమిని జాతీయ రహదారి– 342 కోసం ప్రభుత్వం సేకరించిందన్నారు. అధికారులు అగ్రికల్చర్ ల్యాండ్‌కు ఇచ్చిన పరిహారాన్నే మంజూరు చేస్తున్నారని, తమది నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కాబట్టి ఆ మేరకు పరిహారం ఇప్పించాలని కోరారు.
- తనకు గాండ్లపెంట రెవెన్యూ పొలం సర్వే నంబర్ 211-1, 216-1లో 2.5 ఎకరాల భూమి ఉందని, ఇతరులు దౌర్జన్యంగా పేర్లు నమోదు చేసుకొని పట్టాదార్ పాస్ పుస్తకం పొందారని గంగులమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన భూమిపై ఇతరులకు మంజూరు చేసిన పట్టాదార్ పాస్ పుస్తకం రద్దు చేసి సదరు పొలంపై హక్కులు కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతుడు శ్రీనాథ్

అమడగూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన ఘటన కొక్కంటిక్రాస్–మహమ్మదాబాద్ క్రాస్ రోడ్డులో నిలువురాతిపల్లి బస్టాండు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బలరామయ్య తెలిపిన మేరకు.. తిమిరికుంటపల్లికి చెందిన శ్రీనాథ్ (26) తన సొంత ఆటోలో తుమ్మలలో ఉన్న వ్యవసాయ కూలీలను ఎక్కించుకు రావడానికి స్వగ్రామం నుంచి బయలుదేరాడు. నిలువురాతిపల్లి బస్టాండు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి, పొలాల్లోకి పల్టీలు కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం ఎక్కువగా జరగడంతో శ్రీనాథ్ ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుని భార్య ప్రస్తుతం గర్భిణి కాగా, ఇప్పటికే వీరికి కుమారుడు ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎద్దుల బండి కింద పడి యువకుడి మృతి


మృతి చెందిన కురుబ తిప్పేస్వామి

రాయదుర్గం రూరల్: ఎద్దుల బండి కింద పడి కురుబ తిప్పేస్వామి (19) అనే యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వడ్రహొన్నూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు.. తండ్రి కురుబ శివరుద్రప్పతో కలిసి తిప్పేస్వామి వ్యవసాయ తోటలోకి ఉదయం ఎద్దులబండిలో బయలు దేరాడు. ఊరి బయట తన భుజంపై ఉన్న చెర్నాకోలు కిందపడింది. తిప్పేస్వామి కిందకు దిగి తీసుకుంటుండగా బండి ముందుకు కదిలింది. దీంతో యువకుడిపై టైరు ఎక్కింది. తండ్రి బండిని నిలిపి, గాయపడిన కుమారుడిని హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఎదలోపలి భాగంలో నరాలు, కండరాలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. కళ్ల ముందే చేతికొచ్చిన కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తండ్రితో పాటు తల్లి అనసూయమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. శివరుద్రప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రచిన్ రవీంద్ర..‘ఆర్డీటీ’లో ముద్ర!


ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్, విశాల ఫెర్రర్‌తో రచిన్ రవీంద్ర (ఫైల్)


ఇటీవల ఆర్డీటీలో జరిగిన టోర్నమెంట్‌లో పాల్గొన్న రచిన్


అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో రచిన్ రవీంద్ర

అనంతపురం: వరల్డ్‌కప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఇండియా, ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్కంఠ రేపింది. ఇలాగే, మూడు రోజుల క్రితం న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆటగాడు రచిన్ రవీంద్ర సెంచరీ చేసి పలువురి ప్రశంసలు పొందాడు. న్యూజిలాండ్ జట్టు తరఫున మంచి ఫామ్‌లో కొనసాగుతున్న రచిన్ రవీంద్రకు ఆర్డీటీతో అనుబంధం ఉండడం గమనార్హం. ప్రవాస భారతీయ సంతతికి చెందిన రచిన్ రవీంద్ర 2017, 2018, 2019, 2023లో ఆర్డీటీ నిర్వహించిన పలు టోర్నీల్లో పాల్గొన్నాడు. రచిన్ రవీంద్ర తండ్రి రవీంద్ర బెంగళూరుకు చెందినవారు. రెండు దశాబ్దాల క్రితం న్యూజిలాండ్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. రచిన్ రవీంద్రకు న్యూజిలాండ్ పౌరసత్వం ఉంది. ఆదేశం తరఫున ప్రస్తుతం వరల్డ్‌కప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన మాజీ రంజీ ఆటగాడు షాబుద్దీన్, జోషి, యుగంధర్ రెడ్డి ఆర్డీటీలో రచిన్ రవీంద్రకు ప్రత్యేక కోచ్‌లుగా ఉంటూ, మెళుకువలు నేర్పించారు. తన తల్లి రూప స్ఫూర్తితోనే అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నట్లు రచిన్ రవీంద్ర పేర్కొన్నాడు. అనంతపురం ఆర్డీటీలో తీసుకున్న శిక్షణే క్రికెట్‌లో రాణించడానికి దోహదం చేసిందని తెలిపాడు. కాగా, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్ వీరాభిమానులు అయిన రచిన్ రవీంద్ర తల్లిదండ్రులు రాహుల్ ద్రవిడ్ అనే పేరు నుంచి ‘ ర ’ అనే పదాన్ని, సచిన్ అనే పేరు నుంచి ‘చిన్’ అనే పదాన్ని తీసుకున్నారు. రచిన్ రవీంద్ర అనే పేరు పెట్టారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత


మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగస్వామి

తాడిమర్రి: మండలంలోని దాడితోట సమీపంలోని పుల్లుట్ల కనుమలో సోమవారం అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం సీఎస్‌డీటీ శారదతో కలిసి విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ ఎం.నాగస్వామి వివరాలను వెల్లడించారు. దాడితోట సమీపంలోని పుల్లుట్ల కనుమలో ఉదయం 10 గంటల సమీపంలో సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ జిల్లా పార్నపల్లి వైపు నుంచి ధర్మవరం వైపు వెళుతున్న బొలెరో, టాటా సుమోగోల్డు వాహనాలను తనిఖీ చేశామన్నారు. 63 క్వింటాళ్లు (125 పాకెట్లు) సబ్సిడీ రేషన్ బియ్యం లభించాయన్నారు. దీంతో డ్రైవర్లు, క్లీనర్లను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం, నంద్యాలంపల్లి గ్రామానికి చెందిన వేణుతుర్ల శివకోటి రెడ్డి, వేణుతుర్ల సోమశేఖర్ రెడ్డి, భూమిరెడ్డి నాగేశ్వర్ రెడ్డిలుగా తెలిసిందన్నారు. గ్రామాల్లో ప్రజల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాలను పోలీసుస్టేషన్ తరలించి కేసు నమోదు చేసి నిందితులను ధర్మవరం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బియ్యాన్ని ధర్మవరంలోని సేఫ్టీ స్టాకు పాయింట్‌కు తరలిస్తున్నట్లు సీఎస్‌డీటీ తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు సత్యనారాయణ, నల్లప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సురేష్, విష్ణు, రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు రాజకుళ్లాయప్ప, సావిత్రమ్మ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా.. వ్యక్తి మృతి


మృతి చెందిన బోయ సురేష్


భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న అరుణమ్మ

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో గోరంట్ల–పుట్టపర్తి ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో గుంతపల్లికి చెందిన బోయ సురేష్ (38) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. పని నిమిత్తం సురేష్ గుంతపల్లి నుంచి గోరంట్ల పట్టణానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడిక్కడే మృతి చెందారు. మృతునికి భార్య అరుణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య అరుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- అదనపు చార్జీలేమీ లేవు

ప్రత్యేక బస్సుల వివరాలు

ప్రాంతం	దసరాకు మునుపు	దసరా తర్వాత
బెంగళూరు	34	46
విజయవాడ	9	7
తిరుపతి	11	4
ఒంగోలు/నెల్లూరు	1	2
హైదరాబాద్	37	33
చెన్నై	3	6



అనంతపురం సెంట్రల్: దసరా పండుగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపుతున్నట్లు ఆర్టీసీ జిల్లాప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు చెన్నై నుంచి జిల్లాకు రావడానికి ఈ నెల 18 నుంచి 23 వరకు మొత్తం 95 అదనపు బస్సులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 23 నుంచి 29 వరకు తిరుగు ప్రయాణానికి కూడా 98 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రానుపోను టికెట్ బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు అన్‌లైన్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు స్పందనకు 75 అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ‘స్పందన’ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాయి. మొత్తం 75 అర్జీలు వచ్చాయి. ఫిర్యాదుదారుల సమస్యలు విన్న అనంతరం ఎస్పీ వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఫోన్ చేసి సిబ్బందితో మాట్లాడారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. ‘స్పందన’ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశా డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వయిజర్ సాయినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నృత్య పోటీలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఈనెల 11,12 తేదీల్లో నాటకీకరణ, జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనాభా విద్య (నేషనల్ పాపులేషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు)లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాల కోసం ఫోన్ నంబర్లు 9440944707, 9441823923, 9441144246లో సంప్రదించాలని సూచించారు.

నెట్టికంటి ఆలయ ఈఓగా గురుప్రసాద్

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా గురుప్రసాద్ నియమితులయ్యారు. దేవదాయ శాఖ కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న ఈయనను ఈఓగా బదిలీ చేస్తూ సోమవారం ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఈఓ ఈనెల 10వ తేదీ (మంగళవారం) బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆలయ ఏఈఓ ధనుంజయ తెలిపారు. కాగా, కర్నూలులోని దేవదాయ శాఖ నగల పరిశీలన అధికారిగా ఉన్న డీ.వెంకటేశ్వరరెడ్డి ఇప్పటివరకూ కసాపురం దేవస్థానం ఇన్‌చార్జ్ ఈఓగా విధులు నిర్వహిస్తూ వచ్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య


మృతి చెందిన కోన బాలాద్రి

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని శిరగారిపల్లిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మీసాల రాజు అలియాస్ మీసాల నాగచెన్నుడుకు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్ర అలియాస్ చంద్ర నడుమ కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. చంద్ర ఇంటి వద్దకు తాగి వెళ్లి మీసాల రాజు గొడవలు చేసేవాడు. ఇటీవల పట్నం పోలీసుస్టేషన్‌లో మీసాల రాజుపై చంద్ర ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు అతడిని పిలిపించి మందలించి పంపించారు. అదే కోపంతో సోమవారం రాత్రి మీసాల రాజు మద్యం సేవించి చంద్ర ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశాడు. అదే సమయంలో చంద్ర పెద్దనాన్న కుమారుడు కోన బాలాద్రీ (55) అక్కడికి వచ్చాడు. కోపంతో మీసాల రాజు తన మిద్దె పైకి వెళ్లి రాళ్లతో విసిరాడు. ఆ రాయి వచ్చి కోన బాలాద్రీ తలకు తగలడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య నీలమ్మ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలం నుంచి మీసాల రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. సీఐ యతీంద్ర, పట్నం ఎస్‌ఐ ఇషాక్ బాషా, ముదిగుబ్బ ఎస్‌ఐ వంశీ కృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బైకు ఢీ: యువకుడి మృతి

తలుపుల: లారీ, బైకు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వేపమానిపేట గ్రామం వద్ద చోటు చేసుకుంది. వేపమానిపేటకు చెందిన దేవదాసు కుమారుడు అనిల్‌కుమార్ (18) సోమవారం ద్విచక్రవాహనంలో తలుపుల బయలుదేరాడు. వేపమానిపేట మలుపులో ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. కిందపడిన అనిల్‌కుమార్‌పై వెళ్లింది. స్థానికులు వెంటనే తలుపులకు, అక్కడి నుంచి కదిరికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు బత్తలపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచినట్లు మృతుని కుటుంబీకులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ చెప్పారు.

వెళ్లిపోతున్నా.. వెతకొద్దు!

- లేఖ రాసి బాలుడి పరారీ
- అతని వెంటే మరో ఇద్దరు
- లబోదిబోమంటూ పోలీసుస్టేషన్‌కు తల్లిదండ్రులు
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు


పిల్లలతో పోలీసులు

అనంతపురంక్రైం: ‘‘అమ్మా నాన్న నేను వెళుతున్నాను నన్ను వెతకొద్దు’’ అంటూ ఓ 5వ తరగతి విద్యార్థి లేఖ రాసి ఇంటి తలుపులకు అతికించి పరారయ్యాడు. అతనితోపాటు ద్వారక కాలనీలో నారాయణ స్కూల్‌లో చదివే మరో ఇద్దరు విద్యార్థులు కనిపించకుండా పోయారు. సోమవారం సాయంత్రం ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు గంటల వ్యవధిలోనే పిల్లలను గుర్తించారు. ఒకటో రోడ్డులోని మిత్ర హోటల్ సమీపంలో నివాసం ఉంటున్న ఉదయసింహ, జానకి రామ్‌నగర్‌కు చెందిన సాత్విక్ రెడ్డి, గంగానగర్‌కు చెందిన రాఘవేంద్ర రెడ్డి సోమవారం సాయంత్రం ఇంటి నుంచి పరారయ్యారు. రెండు సైకిళ్లను వెంట తీసుకెళ్లారు. పిల్లలు కనిపించకపోవడం, అదే సమయంలో ఉదయ సింహ రాసిన లేఖ కనిపించడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సీఐ ధరణి కిషోర్ వెంటనే తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలను జల్లెడ పట్టారు. మొదటి రోడ్డులోని డాక్టర్ శివాజీక్లినిక్ సమీపంలో ఉన్న ఒక ఇంటి మేడపై ఉండగా, పిల్లలను పట్టుకున్నారు. దీంతో బాధిత తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

‘కృష్ణా జలాల పునః పంపిణీ వద్దే వద్దు’


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్ క్లాక్: కృష్ణా జలాలను సమీక్షించి పునః పంపిణీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అసంబద్ధమని, నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కరువు ప్రాంతాలకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తామనడం సిగ్గుచేటన్నారు. రాయలసీమ రైతులను అధోగతి పాలు చేసే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ చేపడుతున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్లు ప్రభుత్వం ముందుంచుతామన్నారు. ఇప్పటికే ఇరు రాష్ట్రాల్లో ప్రాజెక్టుల వారీగా వినియోగంలో ఉన్న నీటి పంపిణీ యథాతథంగా ఉంచాలన్నారు. అదనపు, మిగులు జలాలను విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం కరువు పీడిత ప్రాంతాలకు కేటాయించాలన్నారు. హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సుప్రీంకోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా యాజమాన్య బోర్డును విశాఖపట్నంలో కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడంలో ఎదురవుతున్న అడ్డంకులను అధికమించాలని, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో అభివద్ధి వికేంద్రీకరణ సాధన సమితి గౌరవాధ్యక్షులు ఆలూరు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజా హొన్నూర్, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి కేవీ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ రెడ్డి, కోదండరాం, మహమ్మద్ అలీ, బన్నీ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ములు.. ఆదర్శప్రాయులు!

ప్రమాదంలో రెండు చేతులూ కోల్పోయారు. అయినా, అధైర్య పడలేదు. విధిని నిందించలేదు. తమ బలాన్ని నమ్ముకున్నారు. చేతనైన పని చేసుకుంటూ ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. పలువురితో శభాష్ అనిపించుకుంటున్నారు.

- ప్రమాదంలో ఇద్దరి చేతులూ దూరం
- అయినా, స్వయం కృషితో రాణిస్తున్న సోదరులు


చేతులు దెబ్బతిన్నా కలిసి పనులు చేసుకుంటున్న బసవరాజు, వినోద్


ఎడమ చేతితోనే కంప్యూటర్ వర్క్ చేస్తున్న బసవరాజు

సోమందేపల్లి: మండలకేంద్రానికి చెందిన బసవరాజు, వినోద్ అన్నదమ్ములు. 2020 ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒక్కో చేయి కోల్పోయారు. సాధారణ మనుషులు ఎవరికైనా ఇలా అయితే, కుంగిపోతారు. తమ జీవితం ఇక ఇంతేనా అని బాధపడిపోతారు. కానీ, బసవరాజు, వినోద్ అనుకోలేదు. వైకల్యం కలిగినా జీవన పయనం మాత్రం ఆపలేదు. తమకున్న కొద్దిపాటి భూమిని అమ్మి వచ్చిన డబ్బు, బ్యాంకు రుణ సాయంతో టీ స్టాల్, కూల్‌డ్రింక్స్, జెరాక్స్ షాపు ఏర్పాటు చేసుకున్నారు. కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఉన్నత చదువులు చదివినా

బసవరాజు, వినోద్‌ల తల్లి రేణుక చేనేత కార్మికురాలు. 12 ఏళ్ల క్రితం భర్త రాజ గోపాల్ మృతి చెందారు. అయినా, బిడ్డల సంక్షేమమే లక్ష్యంగా ఆమె కష్టపడింది. ఇద్దరు పిల్లలను బాగా చదివించింది. వినోద్ ఐటీఐ పూర్తి చేయగా, బసవ బీకామ్ చదివారు. ఇద్దరూ కియా అనుబంధ పరిశ్రమలో పనిచేసే వారు. అయితే రెండేళ్ల క్రితం ద్విచక్ర వాహనంలో అన్నదమ్ములు వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఇందులో బవసరాజు కుడి చేయి తెగిపోగా, వినోద్ కుడి చేయి బాగా దెబ్బతింది. అనుకోని ప్రమాదం వారిద్దరి జీవితాలను అతలాకుతలం చేసింది. అయినా, అన్నదమ్ములు బాధపడలేదు. తమకున్న కొద్దిపాటి స్థలాన్ని అమ్మితే రూ.6 లక్షల వరకూ వచ్చింది. అందులో వైద్య ఖర్చులకే రూ.5 లక్షలు ఖర్చయింది. అయితే, మిగతా డబ్బుతో వ్యాపారం మొదలు పెట్టారు. ప్రస్తుతం ఇద్దరు నెలకు రూ.30 వేల వరకూ సంపాదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బసవ రాజుకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసి కొద్దిపాటి ఆర్థిక చేయూతనిచ్చింది.

సమస్యకు ఎదురొడ్డి నిలవాలి

రోడ్డు ప్రమాదంలో నేను, మా అన్న వినోద్ ఒకే రోజు ఆసుపత్రి పాలయ్యాం. సమాజం చిన్న చూపు చూసింది. అన్నకు ఓ పెళ్లి సంబంధం కుదరగా యాక్సిడెంట్ అయిన తరువాత వారు రద్దు చేసుకున్నారు. ఇద్దరి చేతులు దెబ్బతినడంతో కుటుంబ పోషణ భారమైంది. ఈ నేపథ్యంలో స్థలం అమ్మిన సొమ్ముతో చిన్న పాటి టీ స్టాల్ ప్రారంభించాం. బ్యాంకు రుణ సౌకర్యంతో ఇప్పుడు కూల్‌డ్రింక్, జెరాక్స్ షాపు కూడా నడపుతున్నాం. ప్రస్తుతం ఆర్థిక సమస్యలు తగ్గుముఖం పట్టాయి. సమస్యకు ఎదురొడ్డి నిలబడితే ప్రతి మనిషి జీవితంలో గెలుస్తాడు. – బసవరాజు

వెంటే శున‘కమ్..కమ్..’!

విశ్వాసానికి పెట్టింది పేరైన జీవి ఏదైనా ఉందంటే అది శునకమే. రోజూ కొంత అన్నం పెడితే చాలు మనం ఏం చెప్పినా చేసేస్తుంది. మనకేదైనా అపాయం ఎదురైతే తనూ ఎదురొడ్డుతుంది. ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చేస్తుంది. మనం వద్దని వారించినా విననంటుంది. ఎంత సేపైనా వెంటే ఉంటుంది. ఈ మాటలకు అద్దం పట్టే చిత్రమే ఇది. సోమవారం బెళుగుప్ప మండలం జల్లిపల్లి సమీపంలో కనిపించింది. ఎద్దుల బండిలో రైతు శంకరప్ప పొలానికి వెళ్తుండగా, పెంచుకున్న శునకం కూడా వెంటే బయలుదేరింది. అంతేనా.. బండి ఎక్కి ఇలా ఠీవిగా ప్రయాణించింది. ఆకట్టుకునే ఈ దృశ్యాన్ని ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

